క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం శొంఠ్యాం, పరదేశిపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విశాఖ జోన్–3 ఆపరేషన్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా మండలంలోని రామవరం, కణమాం, ఎర్రవానిపాలెం, గోరింట, బోయపాలెం, గంభీరం, కొత్త కల్లివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కిక్‌బాక్సింగ్ క్రీడాకారిణికి నగదు ప్రోత్సాహకం



రూ.5 వేల చెక్కును కుష్మితకు అందిస్తున్న శ్రీనివాసరావు

భీమునిపట్నం: కిక్‌బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి కీతిన్‌పేట వద్ద గల సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు నగదు ప్రోత్సాహకం అందించారు. చిప్పాడ గ్రామానికి చెందిన వెంపాడ కుష్మిత ఇదే పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. తండ్రి వెంపాడ కనకరాజు ఆర్మీ ఉద్యోగి. కోచ్ వాసుపల్లి ఆదినారాయణ శిక్షణలో పలు పోటీల్లో పాల్గొంటూ జిల్లా, రాష్ట్రస్థాయిల్లో బంగారు పతకాలను గెలుచుకుంది. ఈ నెల 2వ తేదీన హర్యానాలో భారత్ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కాంస్య పతకం గెలుచుకున్న కుష్మిత సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనుంది. ఈ సందర్భంగా ఆమెను స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అభినందించి, రూ.5 వేలు నగదు అందించారు.

జనావాసాల మధ్య సెల్ టవరా?

- ఆందోళనకు సిద్ధమవుతున్న స్థానికులు



బింద్రానగర్‌లో నిర్మిస్తున్న సెల్ టవర్

మధురవాడ: జీవీఎంసీ 8వ వార్డు కార్‌షెడ్ సమీపంలోని బింద్రానగర్ షిప్‌యార్డు లే అవుట్‌లో నివాసాల మధ్య ఓ ప్రముఖ టెలికం సంస్థ సెల్ టవర్ నిర్మాణం తలపెట్టడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీని రేడియేషన్ వల్ల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని కలవరపడుతున్నారు. పిల్లలు, గర్భిణులు, వృద్ధులపై దీని ప్రభావం అధికంగా ఉంటుందని పలు సర్వేలు కూడా తెలియజేస్తుండటంతో టవర్ నిర్మాణంపై స్థానికులు కొద్ది రోజులుగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జోనల్ కమిషనర్‌కు, ఇతర అధికారులకు ఫిర్యాదులు ఇచ్చామని, అయినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆందోళనకు సిద్ధం అవుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం



పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండ సమీపంలో రోడ్డు మధ్య ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకర స్థితిలో ఉంది. ఇటీవల ఓ కారు ఈ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో, ఓ వైపుగా ఒరిగిపోవడంతో పాటు అడుగుభాగాన బీటలు వారింది. దీంతో ఏ క్షణాన పడిపోతుందో అన్నట్లుగా ఉంది. గాలి, వర్షం వచ్చినప్పుడు అటువైపు వెళ్లాలన్నా స్థానికుల భయపడుతున్నారు. ఏ క్షణంలో పడిపోయినా, పెను ప్రమాదం జరగక తప్పదు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శుభకారిణి.. సౌభాగ్యప్రదాయిని

- శ్రీ మహాలక్ష్మికి భక్తిశ్రద్ధలతో పూజలు
- వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు



విశేష అలంకరణలో చంద్రంపాలెం దుర్గాలమ్మ



వజ్రకవచధారణలో లక్ష్మీనారాయణులు



బైపాస్ రోడ్డు విజయదుర్గ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



గాజుల అలంకరణలో మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారు



విజయదుర్గ ఆలయంలో భక్తులకు అన్నదానం

తగరపువలస: శ్రావణమాసం రెండో శుక్రవారం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో కుంకుమ పూజలు, అర్చనలు చేయించి రక్షలు ధరించారు. గృహాల్లో వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. పిండివంటలు నివేదించారు. తమ కుటుంబాలను ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగేలా కాపాడాలని కోరుతూ తోరణాలు ధరించారు.

- భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారిని ప్రత్యేకంగా గాజులతో అలంకరించారు. బైపాస్‌రోడ్డులోని విజయదుర్గ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తుల తాకిడితో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. ఆలయ ఆవరణలో భారీగా అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. 40 ఏళ్ల క్రితం జాతీయరహదారిని ఆనుకుని ఉన్న అమ్మవారి ఆలయంతో పాటు వెంకటేశ్వరమెట్టపై ఉన్న శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు, బాటసారులకు దాతల సాయంతో అన్నదానం జరుగుతోంది.

బబ్బేలమ్మ ఆలయంలో..

పీఎం పాలెం: కారుషెడ్ బబ్బేలమ్మ ఆలయంలో, స్థానిక ఆఖరు బస్టాపునకు సమీపంలోని శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువు తీరిన శారదాంబ అమ్మవారికి ప్రత్యేక ఆర్చనలు చేశారు.

మధురవాడ: జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం, సిద్ధేశ్వర స్వామి పీఠం, మానం ఆంజనేయులు కాలనీలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయం, టైలర్స్ కాలనీలో విజయ దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

అష్టలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో శ్రీ మహాలక్ష్మి హోమం నిర్వహించారు. లక్ష్మీనారాయణులు వజ్రకవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం మహిళలతో సామూహిక పారాయణాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- స్థానిక వైశాఖేశ్వర ఆలయంలో వైశాఖేశ్వరుని వజ్రకవచధారణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.
- సాగర్‌నగర్‌లోని మొగదారమ్మ మహాలక్ష్మి ఆలయంలో, భీమిలి బీచ్ రోడ్డు హంసవన పుణ్య క్షేత్రం రామాద్రిలో శ్రావణమాస పూజలు వైభవంగా నిర్వహించారు.

గృహ సముదాయం ప్రారంభం



గృహ సముదాయం ప్రారంభిస్తున్న ప్రత్యక్ష పన్నుల కేంద్రీయ బోర్డు సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో ఆదాయ పన్ను విభాగం టైపు -4, టైప్ -5 నివాస గృహ సముదాయలను ప్రత్యక్ష పన్నుల కేంద్రీయ బోర్డు సభ్యుడు ప్రవీణ్ కుమార్ (ఐఆర్ఎస్) శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి పది కోట్ల వ్యయంతో సముద్రానికి 500 మీటర్ల దూరంలో చక్కని వాతావరణంలో ఈ గృహ సముదాయం నిర్మించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఈ నివాసాలను ఆదాయ పన్ను సీనియర్ అధికారులకు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర,తెలంగాణ ఆదాయ పన్ను కమిషనర్ మిథాలి మధుస్మిత, అసిత్‌కుమార్ మహా పాత్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థులకు పోటీలు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వ్యాస రచన, డ్రాయింగ్, శ్రీ కృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణాలు, వంట, పుష్పాలంకరణ, రంగోలి తదితర పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఇస్కాన్ టెంపుల్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 9441792704, 6305952060 నంబర్లను సంప్రదించవలసిందిగా సూచించారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందనల వెల్లువ





బొత్స సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ రాంబాబు,ఆనందపురం వైఎస్సార్‌సీపీ నాయకులు



బొత్సకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

పద్మనాభం/తగరపువలస/కొమ్మాది: స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన బొత్స సత్యనారాయణకు నాయకులు అభినందనలు తెలిపారు. నగరంలోని బొత్స ఇంటికి శుక్రవారం వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. బొత్సకు అభినందనలు తెలిపిన వారిలో పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఆనందపురం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సీనియర్ నాయకులు బంటుపల్లి మణిశంకరనాయుడు, పిన్నింటి వెంకటరమణ, బంక శ్రీను తదితరులున్నారు.

వాటర్ వర్క్స్ పైప్‌లైన్‌కు పగుళ్లు



గొట్టిపల్లి వద్ద వృథాగా పోతున్న తాగునీరు

తగరపువలస: ఆనందపురం మండలం గొట్టిపల్లిలో వాటర్ వర్క్స్‌కు చెందిన పైపులైన్ పగిలిపోయి ఐదు రోజులుగా తాగునీరు వృథాగా పోతుంది. మండలంలోని బోని పంచాయతీలో గోస్తని నది నుంచి పంప్ హౌస్ ద్వారా నీటిని సేకరించి జీవీఎంసీ పరిధిలో నగర ప్రజల అవసరాలు తీర్చడానికి పంపిస్తుంటారు. పలుమార్లు ఈ పైపులైన్ ఇదేచోట పగిలిపోతోంది. వాటర్ వర్క్స్ విభాగం మరమ్మతులు నిర్వహిస్తున్నా, నీటి సరఫరా సమయంలో ఒత్తిడికి తరచూ పగుళ్లు ఏర్పడుతున్నాయి. దీంతో తాగునీరు వృథా కావడమే కాకుండా రహదారి ఛిద్రమవుతోంది. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం స్పందించి శాశ్వత ప్రాతిపాదికన మరమ్మతులు నిర్వహించి, తాగునీటి వృథాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండల రిసోర్స్ భవనానికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



మండల రిసోర్స్ భవనంలో నిర్వహిస్తున్న విద్యాశాఖ కార్యాలయం

తగరపువలస: ఆనందపురం మండల రిసోర్స్ భవనంలో నిర్వహిస్తున్న మండల విద్యాశాఖ కార్యాలయానికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టనున్నారు. 25 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం పూర్తిగా శిథిలమైపోయింది. వర్షానికి శ్లాబు లీకవుతోంది. తలుపులు, కిటికీలు విరిగిపోయాయి. అందులో స్టేషనరీ వస్తువులకు రక్షణ లేకపోవడం, నిరుపయోగంగా టాయిలెట్లు, చుట్టూ అడవిని తలపించే వాతావరణం ఉండటం వలన ఆ భవనంలోకి తరచూ విషపురుగులు ప్రవేశించేవి. దీంతో ఇక్కడ ఉండే అధికారులు, సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ఉపాధ్యాయుల సమస్యలపై ×అడుగు పెట్టాలంటే భయం× శీర్షికతో ఈ నెల ఒకటో తేదీన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీపీ మజ్జి ప్రియాంక శారద రూ.6లక్షల నిధులతో మరమ్మతులు చేయిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తెలిపారు. ఈ నిధులతో భవనానికి, టాయిలెట్లకు మరమ్మతులు, శ్లాబు ఊర్పు, పెయింటింగ్ పనులు చేపట్టినట్లు ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

‘మైనారిటీ సమితి’ జిల్లా అధ్యక్షుడిగా అస్లం ఖాన్



అస్లం ఖాన్‌ను అభినందిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ

సీతమ్మధార: రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 14వ వార్డు సీతమ్మధారకు చెందిన మహ్మద్ అస్లం ఖాన్ నియమితులయ్యారు. సీతమ్మధారలోని ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖీ షుబ్లీ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఫారుఖీ మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు కొత్తగా అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అస్లం ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో గౌరవ ప్రదమైన పదవిని కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకుని వెళ్లి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

‘చంద్రంపాలెం’ ఇన్‌చార్జా .. వద్దే వద్దు

- భారం మోయలేక తప్పుకుంటున్న ఇన్‌చార్జి హెచ్‌ఎంలు
- రాష్ట్రంలోనే పెద్దదైన హైస్కూల్లో నిర్వహణ భారం
- పూర్తిస్థాయి ప్రధానోపాధ్యాయుడి నియామకం తప్పనిసరి



చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్

మధురవాడ: రాష్ట్రంలోనే పెద్దది అయిన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్తి స్థాయి ప్రధానోపాధ్యాయుడు లేక నిర్వహణ భారంగా మారుతోంది. ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుడి పోస్టు భర్తీ చేయకపోవడంతో ఇన్‌చార్జిగా ఉండటానికి సీనియార్టీ ఉన్న ఉపాధ్యాయులు వెనుకడుగు వేస్తున్న పరిస్థితి.

చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో 3, 411మంది విద్యార్థులు, 100మంది వరకు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది ఉన్నారు. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో నిర్వహణ ఇబ్బందులు రాకుండా ఉండడానికి గతంలో రెండో హెచ్‌ఎంగా జయప్రదను నియమించారు. ఆమెకు ఎంఈవోగా పదోన్నతి రావడంతో బదిలీపై వెళ్లిపోయారు. తర్వాత ప్రధానోపాధ్యాయుడిగా రాజబాబు ఒక్కరే ఉన్నా, పూర్తి స్థాయి హెచ్‌ఎం కావడంతో నిర్వహణ ఇబ్బందులు ఉండేవి కాదు. గత ఏప్రిల్‌లో ఆయన ఉద్యోగవిరమణ పొందారు. అప్పటి నుంచి ఆ స్థానాన్ని భర్తీ చేయలేదు. ఆయన తర్వాత సీనియారిటీ ఉన్న ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నా ఇన్‌చార్జి బాధ్యతల స్వీకరణకు ముందుకు రాలేదు. దీంతో తర్వాత సీనియారిటీ ఉన్న ఎస్‌వీఎస్ సోమయాజులు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పూర్తి స్థాయి హెచ్‌ఎం ద్వారానే నిర్వహణ సాధ్యం కానిది ఇన్‌చార్జిల ద్వారా మరింత కష్టం. దీంతో ఆయన కూడా ఈ బాధ్యతలు నిర్వహించలేనని అన్ విల్లింగ్ లెటర్ ఇచ్చేశారు. తర్వాత సీనియారిటీ ఉన్న వ్యక్తికి బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంత పెద్ద పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తరచూ మారిపోవడం వల్ల విద్యా ప్రమాణాలు మెరుగు పరచడం, నిర్వహణ ఎలా సాధ్యం అవుతుందన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఈ ప్రభావం ఇక్కడ అడ్మిషన్ల మీద పడింది. ప్రతీ ఏడాది వెయ్యికి పైగా కొత్త అడ్మిషన్లు వచ్చేవి, ఈ విద్యాసంవత్సరంలో మాత్రం వెయ్యి దాటని పరిస్థితి. ఈ పాఠశాలలో ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిపై విద్యాశాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్‌ను వివరణ కోరగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి చర్యలు చేపడతామన్నారు.

మిస్సింగ్ కేసులపై స్పెషల్ ఫోకస్



బిత్రనాయుడు, వెంకట రమణ (ఫైల్)

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో అదృశ్యమైన వ్యక్తుల అచూకీపై దర్యాప్తు చేయవలసిందిగా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశించిన నేపథ్యంలో మిస్సింగ్ కేసులు వెలికి తీస్తున్నామని పీఎం పాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించి గతంలో నమోదైన రెండు మిస్సింగ్ కేసుల వివరాలివి.. 2016 అక్టోబర్ ఒకటో తేదీన రేవళ్లపాలెంలోని సైట్‌లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న నీలతి బిత్రనాయుడు ఇంటి నుంచి వెళ్లి పోయాడని అతని భార్య సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఇంతవరకూ ఛేదించలేకపోయారు. అలాగే నగరంపాలెం రోడ్డులోని ఎస్ఎస్‌వీడీ అపార్టుమెంట్‌లో నివసిస్తున్న బి.వెంకటరమణ(58) 2019 ఆగస్టు 24వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని కుమారుడు శ్రీనివాస్ తండ్రి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంతవరకు ఆచూకీ లభ్యం కాలేదు. ఈ రెండు కేసుల దర్యాప్తు పునః ప్రారంభించామని సీఐ తెలిపారు.

మైనింగ్ తవ్వకాలతో తీరని నష్టం

- ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- సీపీఎం కార్పొరేటర్ పాదయాత్ర ప్రారంభం



కుసులవాడలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ పరిధిలో చిన్నయ్యపాలెం గ్రామాన్ని ఆనుకుని సర్వే నంబర్ 104 కొండపై మైనింగ్‌కు సిద్ధపడిన ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు డిమాండ్ చేశారు. మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ పంచాయతీలో శుక్రవారం ఆయన పాదయాత్ర ప్రారంభించారు. వి.ఆర్.ఇన్‌ఫ్రా టెక్నాలజీ సంస్థ చేపట్టనున్న మైనింగ్ కారణంగా కుసులవాడ ఎస్సీ కాలనీ, గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రేగానిగూడెం, ఇబ్బాపురం, పందలపాక, బాకూరుపాలెం, జగన్నాథపురం గ్రామాలన్నీ విష ప్రభావానికి లోనవుతాయన్నారు. దుమ్ము, ధూళి కారణంగా ఐదు కిలోమీటర్ల పరిధిలో గాలి, నీరు, పంటపొలాలు నాశనం అవుతాయన్నారు. వరి, మామిడి, జీడి, కూరగాయలు, పువ్వుల పంటలు దెబ్బతింటాయన్నారు. భూగర్భ జలాలతో పాటు చుట్టూ చెరువులు పనికారాకుండా పోతాయన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పూర్తిగా అనారోగ్యాల పాలయి కిడ్నీ, శ్వాసకోశ, ఊపిరితిత్తుల వ్యాధులకు గురవుతారన్నారు. కొండ చుట్టు పక్కల గ్రామాల ప్రజలంతా మైనింగ్‌ను వ్యతిరేకిస్తూ ఈ నెల 28న జరుగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో వినతులు అందజేయాలన్నారు. పాదయాత్రలో భీమిలి జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, వాళ్ల నాగరాజు, డీవైఎఫ్ఐ నాయకుడు శిరువురి శ్రీనివాసవర్మ, ప్రజానాట్య మండలి ప్రతినిధి పంపాన సూర్యనారాయణ, జోగ వెంకటరావు, కొయ్య గౌరి పాల్గొన్నారు.

జూనియర్ వైద్యులకు మద్దతు

- నేడు ప్రభుత్వ వైద్యుల నిరసన

మహారాణిపేట : దేశం యావత్తు తలదించుకునేలా ఒక పీజీ డాక్టర్‌పై జరిగిన అరాచకత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశవ్యాప్త జూనియర్ డాక్టర్ల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలియజేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకాల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. అలాగే జూనియర్ డాక్టర్ల ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తూ నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, డాక్టర్లు అత్యవసర పరిస్థితిని కూడా బహిష్కరించి ఉద్యమం చేస్తున్న వేళ ప్రభుత్వ డాక్టర్లు ఎటువంటి ఆందోళనలు చేయకుండా పేద రోగుల చికిత్సకు పూర్తిగా సహకరించాలని అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకుందన్నారు. తమ అసోసియేషన్‌తో సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఉనికి కోసం ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ పేరుతో బాధ్యతారాహిత్యంగా గంట పాటు విధులు బహిష్కరించి ధర్నా చేయాలని పిలుపునివ్వడం చట్టరీత్యా నేరమని, అలా పిలుపునిచ్చిన వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యం



సీసీ కెమెరాలో నమోదైన మృతుడి చిత్రం

తగరపువలస: ఆనందపురం మండలం గండిగుండం పంచాయతీ పరిధిలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని 25 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన యువకుడి మృతదేహాన్ని వీఆర్వో మంగరాజు, వీఆర్ఏ సింహాచలం గుర్తించారు. సత్రం జంక్షన్ నుంచి అడవివరం వెళ్లే రహదారిలో అశోక్‌నగర్ లే అవుట్ సమీపంలో రహదారి పక్కన తుప్పల్లో ఈ మృతదేహం లభించింది. అతని శరీరంపై నలుపు రంగు నిక్కరు, తెలుగు, నీలం రంగు గళ్లు కలిగిన షర్టు ఉంది. ముఖం గుర్తించలేని విధంగా పాడయిపోయింది. వీఆర్వో ఫిర్యాదు మేరకు ఆనందపురం సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల గ్రామాల్లో విచారించారు. మూడు రోజుల కిందట అతను అడవివరం వైపు నడుచుకుని వెళ్లినట్టు స్థానికంగా ఓ వ్యక్తి తెలిపాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.